క్లుప్తంగా

సర్వేలు వేగవంతం చేయండి

బాడంగి: సర్వేలు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో చేపడుతున్న వివిధ సర్వేలపై సమీక్షించారు. హౌస్ హోల్డ్, జియోట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్, ఎంఎస్ఎంఈ సర్వేలు ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి, ఎంజే వలస, బీఎన్ వలస, జీసీహెచ్ పల్లి గ్రామ సచివాలయాలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, వారి పనితీరును పరిశీలించినానంతరం ఆయన హౌస్‌హోల్డ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, ఈ-సర్వీస్, శానిటేషన్ పనులు, మినీ గోకులాల స్థితిగతులపై సమీక్షించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.257

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందని ఉపాధి హామీ పథకం వేతనదారులకు ఏపీవో ఎస్.హరనాధరావు సూచించారు. మండలంలోని సరసనాపల్లి, కాగితాపల్లి, ఏవీ పురం, అంబాడ తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయాలి

వంగర: రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేయాలని రాజాం వ్యవసాయ సహాయ సంచాలకులు కోళ్ల చంద్రరావు సూచించారు. మండలంలోని ఎం.సీతారాంపురం రైతు సేవా కేంద్రంలో వీఏఏలు, వీఆర్‌వోలతో మంగళవారం సమావేశమైన ఆయన.. మినుము, పెసలు, మొక్కజొన్న తదితర పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయడం ప్రారంభించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియంను రైతులే నేరుగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏవో తట్టికోట కన్నబాబు, ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారాదిలో 'పొలం పిలుస్తోంది'

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రబీ సీజన్ పంటల సాగులో అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అగ్రికల్చర్ ఇన్‌చార్జ్ ఏడీ మజ్జి శ్యామసుందరరావు పలు సూచనలు చేశారు. పెసలు, మినుములు వంటి అపరాల పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఏ విధంగా సాధించాలన్న అంశాలను తెలిపారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం

రామభద్రపురం: గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో రత్నం సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆమె.. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు.

వితరణ

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పున్నాన బాలాజీనాయుడు పలక, బలపం మంగళవారం వితరణ చేశారు. రూ.2500లతో కొనుగోలు చేసిన పలక, బలపంను ప్రతీ విద్యార్థికి అందజేసినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతకు అభినందనలు తెలిపారు.

సక్రమంగా రికార్డులు నిర్వహించాలి

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని హెచ్ఎంలకు ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. స్థానిక పట్టణ పరిధిలోని కొండపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, రుచి, శుచికరమైన భోజనం అందివ్వాలని తెలిపారు. గ్రామాల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రినాయుడు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

తెర్లాం: మండలంలో ఈ నెల 14వ తేదీన 18 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల ఇరిగేషన్ ఏఈ హరిబాబు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

గడ్డివాములు దగ్ధం

రేగిడి: మండలంలోని అంబాడకు చెందిన రైతు మజ్జి సత్యంనాయుడి రెండెకరాల గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

- రాజాంలో రింగురోడ్డు నిర్మాణానికి చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కానరాని చర్యలు
- కనీసం ప్రతిపాదనలు కూడా చేయని అధికార యంత్రాంగం
- నిర్మాణం జరిగితే ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని జనం ఆశలు
- ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని ప్రజల డిమాండ్



రింగురోడ్డు నిర్మాణం జరగాల్సిన ప్రాంతంలో అధ్వానంగా మట్టిరోడ్డు

రింగురోడ్డుకు.. మోక్షమెప్పుడో?

రాజాం: తమ్ముళ్లూ.. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజాంలో రింగు రోడ్డు నిర్మాణం చేస్తాం. ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూస్తాం. ఇవీ.. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు, సీఎం చంద్రబాబునాయుడు కలిసి రాజాం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీ. వారు అనుకున్నట్లుగానే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికలప్పుడు వారు ఇచ్చిన రింగు రోడ్డు హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. అసలు రింగు రోడ్డు నిర్మాణం జరుగుతుందో.. లేదో.. తెలియని పరిస్థితి నెలకొంది. ఇదంతా గమనిస్తున్న పట్టణ వాసులు రింగు రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో అని అనుకుంటుండడం గమనార్హం.

ట్రాఫిక్ అవస్థలు..

రాజాంలోని పాలకొండ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పండగలు, యాత్రలు, ఉత్సవాలు, రాజకీయ సమావేశాలు జరిగేటప్పుడు ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ప్రస్తుతం అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం ఇప్పుడున్న రోడ్డు మరమ్మతులు చేస్తుండడంతో దుమ్మూ, ధూళి అధికంగా చెలరేగుతోంది. దీంతో ఆ వైపుగా వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకొండ, సంతకవిటి, వంగర, రేగిడి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రాజాం పట్టణానికి వచ్చేందుకు ఈ రోడ్డు ఒక్కటే ఆధారం కావడంతో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఎన్నికలకు ముందు హామీ..

కూటమి నేతలు.. ఎన్నికలకు ముందు రాజాం..కు రింగురోడ్డు అవసరమని, కంచరాం ముందు ఉన్న టిడ్కో కాలనీ పక్క నుంచి బుచ్చింపేట, జీఎంఆర్ కేర్ ఆస్పత్రిని క్రాస్ చేస్తూ రింగురోడ్డు నిర్మిస్తామని, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిస్తామని భరోసా ఇచ్చారు. వారి పార్టీ అధికారంలోకి రాగానే రింగురోడ్డు నిర్మాణం జరుగుతుందని అందరూ ఆశించారు. అయితే అధికారం చేపట్టి ఆరు నెలలైనా రింగురోడ్డు నిర్మాణ ప్రస్తావన ఎక్కడా రాకపోవడంతో కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ నిర్మాణం ఎప్పుడు చేస్తారా అని అందరూ ఎదురుచూడాల్సిన పరిస్థితి. దీనికి తోడు గతంలో టిడ్కో, జగనన్న కాలనీల కోసం గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన డబుల్ రోడ్డు నిర్వహణను సైతం ఈ ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది. ఫలితంగా ఆ రోడ్డు ఇప్పుడు పూర్తిగా అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా ఏర్పడిన గుంతలతో అటువైపుగా వెళ్లే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. మరోవైపు మరమ్మతులు చేస్తున్న ప్రధాన రోడ్డులో ధూళి చెలరేగకుండా నీటితో తడపడం వంటి కనీస నిర్వహణ లేకపోవడంతో వాహనదారులు, పాదచారుల ముక్కు, కళ్లల్లోకి దుమ్మూధూళి వచ్చి చేరుతోందని, ఫలితంగా ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా టిడ్కో కాలనీ రోడ్డు

త్వరగా రింగురోడ్డు నిర్మించాలి..



రాజాం పట్టణంలో పాలకొండ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే. ఎన్నికల ముందు రింగురోడ్డు వేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. త్వరగా రింగురోడ్డు వేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. ఉదయం 9, మధ్యాహ్నం 2, సాయంత్రం 5 గంటల సమయంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది.

– చిత్తిరి వాను, ప్రయాణికుడు, చిన్నయ్యపేట

హామీ నిలబెట్టుకోవాలి..



రాజాం..కు రింగురోడ్డు నిర్మిస్తామన్న కూటమి నేతలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. పైడితల్లి అమ్మవారి ఆలయం దగ్గర నుంచి కంచరాం..కు అనుసంధానం చేస్తూ టిడ్కో కాలనీ మీదుగా రింగురోడ్డు వేస్తామన్నారు. ఇంతవరకు ఆ నిర్మాణ ప్రతిపాదనలు కనిపించడం లేదు. త్వరితగతిన నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– పాలవలస గోపి, దోలపేట, రాజాం

రోడ్లపైనే అభివృద్ధి ఆధారం..

రాజాం పట్టణ అభివృద్ధి.. ప్రధానంగా రోడ్లపైనే ఆధారపడి ఉంది. ఇటు విజయనగరం, అటు శ్రీకాకుళం ఇంకోవైపు పార్వతీపురం మన్యం జిల్లాలను రాజాం పట్టణమే కలుపుతోంది. విద్య, వాణిజ్యం పరంగా రాజాం అభివృద్ధిలో పయనిస్తోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాజాం ప్రధాన రోడ్డును శ్రీకాకుళం రోడ్డులో విస్తరించడం జరిగింది. పాలకొండ, చీపురుపల్లి రోడ్లలో విస్తరణ పనుల నిమిత్తం రోడ్డు పక్కన ఉన్న షాపులను తొలగించి, ఆ రోడ్డును 80 అడుగుల వరకు చదును చేయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు హయాంలోనూ ఈ రోడ్ల నిర్మాణంతో పాటు రింగురోడ్డు నిర్మాణం కూడా జరుగుతుందని అందరూ భావించారు. అయితే ఇంతవరకు రింగురోడ్డు ప్రస్తావన లేకపోవడంతో ఇప్పట్లో రింగురోడ్డు నిర్మాణానికి మోక్షం లేనట్లేనా అని పలువురు అంటున్నారు.

అధ్వానంగా రోడ్డు



రేగిడి మండలంలోని ఉంగరాడ మెట్ట, మజ్జిరాముడుపేట గ్రామాల జంక్షన్‌ల వద్ద పాలకొండ-రాజాం రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలమయం కావడంతో ఆ వైపుగా ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాజాం నుంచి సంకిలి వరకు బీటీ రోడ్డు నిర్మించారు. ఈ క్రమంలో అయా జంక్షన్‌ల వద్ద సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. ఆ తర్వాత ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగిపోయింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్అండ్‌బీ అధికారులు సైతం రోడ్డును పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – రేగిడి

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్



ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పండించిన కూరగాయలు, ఆకు కూరలను వంగర మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం విక్రయించారు. ప్రకృతి సాగులో సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలు మంచి ఆరోగ్యాన్నిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు సిబ్బంది పోటీపడ్డారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు, ఐసీఆర్‌పీ వి.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు. – వంగర

కోడ్ ముగిసినా.. ముసుగు తీయరా?



ఎన్నికల కోడ్ ముగిసినా బొబ్బిలి, బాడంగి మండలాల్లో కొన్నిచోట్ల నేతల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అప్పుడెప్పుడో వేసిన ముసుగులు ఇంకా తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వేసిన ముసుగులు తీయకపోవడం పట్ల పలువురు మండిపడుతున్నారు. అధికారులు పక్షపాత వైఖరి వీడాలని, ముసుగు వేసినప్పుడు ఉన్న శ్రద్ధ.. తీయాల్సిన సమయం వచ్చినప్పుడు లేదా అని నిలదీస్తున్నారు. –బొబ్బిలి, బాడంగి

విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు



బొబ్బిలి: ఆందోళన చేస్తున్న అఖిల పక్ష నాయకులు, కార్యకర్తలు



రామభద్రపురం: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సీపీఐ రాస్తారోకో



బాడంగి: వాల్‌పోస్టర్లు ప్రదర్శించి, నిరసన తెలియజేస్తున్న సీపీఎం కార్యకర్తలు, ప్రజలు

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తు ప్రజావ్యతిరేక విధానాలపై నిరసిస్తూ మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయంతో రూ.12 వేల కోట్ల వరకు ప్రజలపై భారం పడుతోందన్నారు. ఓ వైపు విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతుంటే ఇప్పుడు స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ చార్జీలు భారీగా పెంచి ప్రజలపై పెనుభారం మోపడం ఎంతమాత్రం సరికాదన్నారు. మోదీ ప్రభుత్వం వ్యాపారవేత్త అదానీకి కొమ్ముకాస్తోందని, అతడికి సంబంధించి కొన్ని వేల కోట్ల రుణం మాఫీ చేసి పెత్తందారీ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి చేసే ఆలోచనలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లెంక లక్ష్మి, సామిరెడ్డి లక్ష్మణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు బిగిస్తే పగలగొట్టండన్న వారే..

బొబ్బిలి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెడితే పగలగొట్టండి అని పిలుపునిచ్చిన వారే ఇప్పుడు అవే స్మార్ట్‌మీటర్లు పెట్టి, విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక పట్టణంలోని 5, 6, 7వ వార్డుల్లో అఖిల పక్ష నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌కు రీచార్జ్ చేసుకోకపోతే కాల్స్, నెట్ ఆగిపోయినట్లే కూటమి ప్రభుత్వం తీసుకువచ్చే స్మార్ట్‌మీటర్లతో రీచార్జ్ చేసుకోకుంటే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ప్రస్తుత విధానంలో పెనాల్టీతో విద్యుత్ బిల్లు చెల్లించుకునే అవకాశం ఉందని, స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఆ అవకాశం ఉండదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు, సీపీఎం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

40 రోజుల్లో పరిష్కరిస్తాం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యుటేషన్ సమస్యలు సహా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు, వివిధ ధ్రువపత్రాలకు సంబంధించి ప్రజల నుంచి అధికారులు వినతిపత్రాలు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే మరోసారి జరిగే సదస్సుల్లో తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



సంతకవిటి: మామిడిపల్లిలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు



రాజాం: రాజయ్యపేటలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు రాజు



తెర్లాం: పణుకువలసలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్



రేగిడి: గుళ్లపాడులో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దారు చిన్నారావు



బొబ్బిలి: పక్కి గ్రామంలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు

బొబ్బిలి రూరల్: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్టీలకతీతంగా పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పోతుల రవికుమార్, ఈవోఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీ చేపట్టాలి

వంగర: మహిళా సంఘాలు వాడుకున్న రుణాలను సకాలంలో రికవరీ చేయాలని ఏపీఎం తెర్లి మంగమ్మ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం మంగళవారం జరిగింది. స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, హెచ్‌డీఐఎఫ్ రుణాల రికవరీ చేపట్టాలని సిబ్బందికి ఆమె సూచించారు. ఇదిలా ఉండగా, స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాథ్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాలని సూచించారు.

ప్రజాసమస్యలపై దశల వారీ పోరాటం

- ప్రజలకు న్యాయం జరిగేలా చూడడమే వైఎస్సార్ సీపీ లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై దశల వారీ పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రైతు సమస్యలపై ఈ నెల 13వ తేదీన రైతులందరితో కలిసి ధర్నా చేస్తామన్నారు. ఈ నెల 27వ తేదీన విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమిస్తామని, జనవరి 3వ తేదీన విద్యార్థుల సమస్యలపై ఆందోళన బాట పడతామని స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడు అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను ఊదరగొట్టిన ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత వారు ఇచ్చిన ఏ హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమన్నారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేంత వరకు పార్టీ తరఫున నిలదీస్తూనే ఉంటామన్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం, తల్లికి వందనం పథకం పేరిట చదువుకునే ప్రతీ బిడ్డకు రూ.15 వేలు చొప్పున ఇస్తానని అన్ని వర్గాల వారిని కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, వారి మోసాలపై గళం విప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఓ వైపు విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇవి చాలవన్నట్లుగా విద్యుత్ చార్జీలు పెంచారని దుయ్యబట్టారు. ఇస్తానన్న హామీలు అమలు చేయకుండానే అధికారంలోకి వస్తే పెంచబోమన్న విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. ఇదిలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల ఏరివేత ప్రారంభించేశారన్నారు. ప్రజల సంక్షేమం వదిలేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలకు గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాడంగి జెడ్పీటీసీ సభ్యుడు పి.రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ సింహాచలంనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయుర్వేద వైద్యసేవలు మంగళవారం అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కీళ్లనొప్పులు తదితర దీర్ఘకాలిక సమస్యలకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు ప్రతీ విద్యార్థి ఆరోగ్యం తనిఖీ చేసి, మెరుగైన ఆరోగ్యానికి సలహాలు, సూచనలు చేశారు.

రేగిడి: క్షయ రహిత జిల్లా సాధనలో భాగంగా మండలంలోని బూరాడ, రేగిడి గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణ చర్యలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూరాడ, రేగిడి పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనాచౌదరి, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, గ్రామస్తులకు వైద్యసేవలు అందజేశారు. అనంతరం ఎన్‌సీడీ 3.0 సర్వే చేశారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో అక్కడి ప్రజలతో మంగళవారం సమావేశమైన ఆయన.. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు.